క్లుప్తంగా

చెక్‌డ్యామ్ పనుల పరిశీలన



చెక్‌డ్యామ్ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

అడ్డగూడూరు : మండలంలోని ధర్మారం గ్రామంలోని మూసీ వాగు పై నిర్మిస్తున్న చెక్‌డ్యామ్ పనులను బుధవారం ఎమ్మెల్యే మందుల సామేల్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం సమీపిస్తున్నందున చెక్‌డ్యామ్ పనులు త్వరిగతిన పూర్తి చేయాలన్నారు. లక్ష్మీదేవికాల్వ గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయని పలువురు రైతులు ఆయన దృష్టికి తెవడంతో సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఆయన వెంట పలువురు నాయకులు, రైతులు తదితరులు ఉన్నారు.

రైతులను ఆదుకోవాలి

ఆత్మకూరు(ఎం): ఇటీవల ఈదురుగాలులకు నష్టపోయిన మామిడి తోటల రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బీసు చందర్ గౌడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఈదురు గాలులకు మామిడి కాయలు నేలరాలి రైతులు ఇబ్బందులు పడుతున్నా సంబంధిత అధాకారులు పట్టించుకోలేదన్నారు.

ఉచిత వైద్యశిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

మునుగోడు: మండలంలోని కొంపల్లి గ్రామంలో హైదరాబాద్ యశోద ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో దాదాపు 500 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జాల వెంకన్నయాదవ్, యశోద ఆస్పత్రి వైద్య సిబ్బంది డాక్టర్ జైశ్రీ, డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ రాధిక, డాక్టర్ సంతోషి, కాంగ్రెస్ నాయకులు జాల మక్కెన అప్పారావు, రత్నాచారి తదితరులు పాల్గొన్నారు.

అనాథాశ్రమానికి బియ్యం అందజేత

రామన్నపేట : నార్కట్‌పల్లిలోని ఓ అనాథాశ్రమానికి మండలంలోని కక్కిరేణి గ్రామం కన్‌స్ట్రక్షన్ ఇండస్ట్రీ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (సీఐడీసీ) ఆధ్వర్యంలో ఐదు క్వింటాళ్ల బియ్యాన్ని అందజేశారు. కార్యక్రమంలో అక్షర కిరణం కోఆర్డినేటర్ మేదరి కిరణ్‌కుమార్, సామాజిక కార్యకర్త వేముల సైదులు, మెట్టు మధు, కన్నెబోయిన నవ్య, విజయలక్ష్మి, కనకమ్మ, భార్గవి, పుష్పమ్మ, నర్మద , కావ్య, సైదమ్మ, పారిజాత, భారతమ్మ, వరలక్ష్మి, రాధ, సంతోష, అనిత, సంధ్య, మమత, అనసూర్య పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నను అధిక మెజార్టీతో గెలిపించాలి

మోత్కూరు : వరంగల్ – ఖమ్మం – నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో పట్టభద్రులంతా తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని తీన్మార్ మల్లన్న టీమ్ మండల కోకన్వీనర్ చేడె ప్రవీణ్‌కుమార్ కోరారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. తీన్మార్ మల్లన్నను శాసన మండలికి పంపితే ప్రజా సమస్యలపై గళం విప్పి వాటి పరిష్కారం కోసం పోరాడుతారన్నారు.

రామన్నపేట : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపునకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పున్న రమేష్ కోరారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో ప్రతిఓటరును కలిసి మొదటి ప్రాధాన్యత ఓటు తీన్మార్ మల్లన్నకు వేయాలని ప్రచారం నిర్వహించాలన్నారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని రాష్ట్రప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించి ఖాళీగా ఉన్నటువంటి ఉద్యోగాలను భర్తీ చేస్తుందని వివరించారు. గతంలో పట్టభద్రుల ఓట్లతో గెలిచిన అభ్యర్థులు నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యలను పట్టించుకోలేదని ఆరోపించారు.

కాలనీ సమస్యలు పరిష్కరించాలని వినతి

ఆలేరురూరల్ : మున్సిపాలిటీలోని డబుల్ బెడ్ రూమ్(కేసీఆర్) కాలనీ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాలనీ వాసులు బుధవారం మున్సిల్ చైర్మన్ మున్సిపల్ శంకరయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కాలనీ కనీస వసతులు లేక ఇబ్బందులు పడుతున్నా మన్నారు. కార్యక్రమంలో రాజు, రమేష్, వెంకటేష్, రవి, రాములు, శంకర్, వంశీ పాల్గొన్నారు.



మున్సిపల్ చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

అద్దె భవనంలో ఇంకెన్నాళ్లు..?

- 2007నుంచి అద్దె భవనంలో కొనసాగుతున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం
- ఇరుకుగదులు, అరకొర వసతుల మధ్య కార్యాకలాపాలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



అద్దె భవనంలో కొనసాగుతున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

బీబీనగర్: రియల్ ఎస్టేట్ వ్యాపారానికి కేంద్ర బిందువుగా మారిన బీబీనగర్ మండలంలో రిజిస్ట్రేషన్ల ద్వారా ఏటా కోట్ల రూపాయల ఆదాయం వస్తోంది. అయినా ఇక్కడున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఇంకా అద్దె భవనంలోనే కొనసాగుతోంది. 2007లో బీబీనగర్‌లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఇరుకుగదులు, అరకొర వసతుల మధ్య కార్యాలయం కొనసాగుతోంది. పక్కా భవనం లేని కారణంగా రిజిస్ట్రేషన్లు చేయించుకోవడానికి వచ్చే జనం ఇబ్బందులు పడుతున్నారు.

స్థల సమస్య తీరినప్పటికీ..

మండల కేంద్రంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవనానికి అనుకూలమైన స్థలం దొరకక సొంత భవన నిర్మాణానికి నిధులు విడుదల కావడం లేదని అప్పట్లో అధికారులు చెప్పుకొచ్చేవారు. విషయం తెలుసుకున్న బీబీనగర్‌కు చెందిన ఓ రైతు బీబీనగర్– నాగిరెడ్డిపల్లి రోడ్డులోని తన భూమిలోని 500గజాలను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పేరిట ఏడేళ్ల క్రితం ఉచితంగానే రిజిస్ట్రేషన్ చేశారు. దీంతో స్థల సమస్య తీరినట్టైంది. అయితే గతంలో ప్రభుత్వం సొంత భవనాలు లేని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను గుర్తించి భవన నిర్మాణాలకు నిధుల మంజూరుకు జీఓ విడుదల చేసినా ఆ జాబితాలో బీబీనగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం లేకపోవడం గమనార్హం.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద అగచాట్లు

హైదరాబాద్‌కు కూత వేటు దూరంలో ఉన్న బీబీనగర్ మండలంలో నిత్యం 100కు పైగానే ప్లాట్ల క్రయ విక్రయాలు జరగుతుంటాయి. దీంతో ప్రభుత్వానికి దండిగా ఆదాయం వస్తున్నా సొంత భవనం నిర్మించలేపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కార్యాలయం అద్దె భవనంలో కొనసాగుతుండడంతో కార్యాలయానికి వచ్చే ప్రజలు సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన వారు ఇరుకు గదుల్లో ఉండలేక ఆరుబయటే వేచి ఉండాల్సి వస్తోంది. కనీసం నిల్చోవడానికి కూడా జాగాలేక గంటల తరబడి ఆరు బయట రోడ్లపైనే ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి భవన నిర్మాణానికి నిధులు విడుదల చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా

మండల కేంద్రానికి చెందిన ఓ రైతు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణానికి స్థలం ఇచ్చి రిజిస్ట్రార్ కార్యాలయం పేరిట రిజిస్ట్రేషన్ చేశారు. ప్రభుత్వం నుంచి భవన నిర్మాణానికి నిధులు మంజూరు కాలేదు. నిధుల మంజూరుకు సంబంధించి ప్రభుత్వానికి ప్రతి పాదనలను పంపుతాం. బీబీనగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాను.

– బలరాం, సబ్ రిజిస్ట్రార్ అధికారి, బీబీనగర్

రైతులు సేంద్రియ వ్యవసాయం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రామారావు

మోత్కూరు : రైతులు సేంద్రీయ వ్యవసాయం చేయాలని తెలంగాణ ప్రాంత గోసేవ ప్రముఖ్ ఆకుతోట రామారావు అన్నారు. మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని స్థానిక ఆర్యవైశ్య భవనంలో గోవర్ధన గిరి గోశాల, ఆది గురు భారత ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఓం సాయి చిల్డ్రన్స్ క్లినిక్ సహకారంతో బుధవారం సేంద్రీయ వ్యవసాయ సాగు విధానంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గో ఆధారిత సేంద్రియ వ్యవసాయంపై రైతులు ఆసక్తి చూపాలన్నారు. సేంద్రియ వ్యవసాయంతోనే నేలను, పర్యావరణాన్ని, ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. దేశీయ విత్తనాలను కాపాడుకోవాలన్నారు. గోఆధారిత ప్రకృతి వ్యవసాయ నిపుణులు రంజాన్ రమేష్, దేశీ విత్తన పరి రక్షకులు శ్రీకాంత్, ఏబీఎస్ ఫౌండేషన్ స్థాపకులు గోపి మాధవ్‌లు సేంద్రీయ వ్యవసాయ విధానాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో జ్ఞానేశ్వరి ఆశ్రమం శ్రీశ్రీ స్కందానంద సరస్వతి మాత గోఆధారిత ఉత్పత్తి నిపుణులు కాంబోజు మహేందర్, బిళ్లపాటి గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుంతల రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి



అధ్వానంగా ఉన్న రోడ్లను చూపిస్తూ నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

రామన్నపేట : మండలకేంద్రంలో గుంతలమయంగా మారిన రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి కందుల హన్మంత్ కోరారు. బుధవారం పాత ఎస్‌బీఐ వద్ద ఏర్పడిన గుంతలను పరిశీలించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆర్ అండ్ బీ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పిట్టల శ్రీనివాస్, బోళ్ల వెంకటేశ్వర్లు, బావండ్లపల్లి సత్యం, ఆముద ఆంజనేయులు, నకిరేకంటి సురేష్, గొరిగె మల్లేష్, తరిగొప్పల వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

త్వరలోనే ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేస్తాం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న సింగిల్‌విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి

చౌటుప్పల్ : ధాన్యం కొనుగోళ్లను త్వరితగతిన పూర్తి చేస్తామని సింగిల్‌విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి అన్నారు. మండలంలోని చౌటుప్పల్, తాళ్లసింగారం, మందోళ్లగూడెం, నేలపట్ల, ఎస్.లింగోటం, అంకిరెడ్డిగూడెం, జైకేసారం, పంతంగి గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆయన సందర్శించారు. రైతులతో మాట్లాడారు. ఆయా కేంద్రాలలో నిల్వ ఉన్న 13800బస్తాలలో 10వేల బస్తాలను మిల్లులకు ఎగుమతి చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు సహకరించాలన్నారు. రైతులు తమ ధాన్యంలో తాలు, మట్టి లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయా కేంద్రాల్లో నిర్వాహకులు సీరియల్ నెంబర్ ప్రకారంగానే తూకాలు వేయాలని, ఎక్కడ కూడా సీరియల్ తప్పొద్దన్నారు. ఆయన వెంట పీఏసీఎస్ సెక్రటరీ ఎరుకల రమేష్, డైరెక్టర్ దొడ్డి శ్రీశైలం పాల్గొన్నారు.

క్రీడాకారులకు పండ్లు, గుడ్లు పంపిణీ



విద్యార్థులకు పండ్లు అందజేస్తున్న శ్రీనివాస్

వలిగొండ : మండల కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న వేసవి కాలం క్రీడా శిక్షణ శిబిరంలోని క్రీడాకారులకు బుధవారం మండల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పండ్లు, గుడ్లు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాగెల్లి వల్లి, పోలేపాక భిక్షపతి, మైసొల్ల శ్రీకాంత్, బుంగమట్ల శ్రీనివాస్, తవటం రమేష్ ,బాలగోని మధు,గాడిపల్లి అశోక్, బాలరాజు, నరేష్ ,పోలేపాక రాజేష్ పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

చండూరు: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బండ శ్రీశైలం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం చండూరులో నిర్వహించిన సీపీఎం ముఖ్యుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుకు ఓటు వేసినవారికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వెంకటేశం, జెర్రిపోతుల ధనంజయ గౌ డ్, లింగయ్య, రవి, గౌసియా బేగం , నరసింహ, వెంకన్న, స్వామి పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తుర్కపల్లి: మండలంలోని రాంపూర్‌లో గల మోడల్ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్స్‌పాల్ మధుప్రకాశ్ తెలిపారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎంపీసీలో 40 సీట్లు, బైపీసీలో 40 సీట్లు, సీఈసీలో 40 సీట్లు, ఎమ్ఈసీలో 40 సీట్లు, మొత్తం 160 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో అప్లై చేసుకోవాలని తెలిపారు. వివరాలకు రమేశ్‌రెడ్డి 9963085686, మహిపాల్ 9553085978 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

బుచ్చిరెడ్డికి కర్క ముత్తారెడ్డి స్మారక పురస్కారం



బుచ్చిరెడ్డి

చండూరు : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కర్క ముత్తారెడ్డి స్మారక పురస్కారానికి ఎంపికై నట్లు విజ్ఞాన వికాస మండలి కన్వీనర్ సుమలత, వ్యవస్థాపక అధ్యక్షుడు మధుకర్ ఓ ప్రకటనలో తెలిపారు. విజ్ఞాన వికాస మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు తెలుగు రాష్ట్రాల కవితల పోటీల్లో బుచ్చిరెడ్డిని ఎంపిక చేసినట్లు బుధవారం తెలిపారు. హైదరాబాద్‌లో త్వరలో జరిగే 31వ వార్షికోత్సవంలో పురస్కారాలు అందజేయున్నట్లు పేర్కొన్నారు. బుచ్చిరెడ్డి పురస్కారానికి ఎంపిక కావడంపై పాఠశాల ఉపాధ్యాయ బృందం, కవులు, రచయితలు అభినందనలు తెలిపారు.

టీజీ క్రిస్టియన్స్ సేవా సమితి కార్యాలయం ప్రారంభం



ప్రారంభోత్సవంలో పాల్గొన్న పాస్టర్లు

భువనగిరి క్రైమ్ : పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన టీజీ క్రిస్టియన్ సేవా సమితి నూతన కార్యాలయాన్ని బుధవారం టీజీ సేవా సమితి అధ్యక్షుడు జిపాల్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా కమిటి అధ్యక్షుడు జాన్సన్, ప్రభాకర్ , జాన్ జహంగీర్, పీటర్ బాబు, స్టీఫెన్, ప్రభాకర్, సంజీవ, సుధాకర్, జాన్, బాబ్జి, పలువురు క్రిస్టియన్లు తదితరులు పాల్గొన్నారు.

బూర నర్సయ్యగౌడ్ గెలవడం ఖాయం



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రమణగోని శంకర్

చౌటుప్పల్ : భువనగిరి ఎంపీగా డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ గెలుపు ఖాయమని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రమనగోని శంకర్, అసెంబ్లీ కన్వీనర్ దూడల భిక్షంగౌడ్ అన్నారు. పట్టణ కేంద్రంలో బుధవారం పార్లమెంట్ ఎన్నికలపై మున్సిపాలిటీ నాయకులతో సమీక్ష నిర్వహించారు. బూత్‌లవారీగా ఓటింగ్ సరళిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూన్ 3న ఎవరికి అందని ఫలితాలు వస్తాయన్నారు. హామీల పేరుతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్‌ను ఓటర్లు చీదరించుకున్నారన్నారు. పార్టీ అభ్యర్థి కోసం ప్రచారం చేసిన కార్యకర్తలను అభినందించాల్సి ఉందన్నారు. బీజేపీ, నరేంద్రమోదీని నమ్మి ఓటు వేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నెల 27న జరగనున్న పట్టభద్రుల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించుకోవాలని సూచించారు. బీజేపీ మున్సిపల్ కమిటీ అధ్యక్షుడు కంచర్ల గోవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీనియర్ నాయకుడు ముత్యాల భూపాల్‌రెడ్డి, కౌన్సిలర్ ఆలె నాగరాజు, నాయకులు దాసోజు భిక్షమాచారి, ఊడుగు వెంకటేశం, కాసుల వెంకటేశం, గోశిక పురుషోత్తం, వనం ధనుంజయ్య, కట్ట కృష్ణ, పోలోజు శ్రీనివాస్‌చారి, గట్టు మొగులయ్య, ఊదరి రంగయ్య, బుడ్డ సురేష్, పాలెం అశోక్ పాల్గొన్నారు.

నర్సయ్య గౌడ్‌దే విజయం

మునుగోడు: పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి స్థానం నుంచి పోటీచేసిన బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్ భారీ మెజార్టీతో గెలుస్తాడని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకుడు మాదగోని నరేందర్‌గౌడ్ అన్నారు. బుధవారం ఆయన మునుగోడులో విలేకర్లతో మాట్లాడారు. బీజేపీతోనే దేశాభివృద్ధి చెందుతుందని భావించి యువత, మేథావులు బీజేపీకి ఓటు వేశారన్నారు. ఆయన వెంట కర్నాటి శేఖర్ గౌడ్, దుబ్బ జెల్లయ్య, పందుల యాదయ్య, సోలే వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

• ప్రైవేటు వాహనాల పార్కింగ్‌కు అడ్డాగా బస్‌షెల్టర్



ఎండలో బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

ఆత్మకూరు(ఎం) : బస్సు ప్రయాణికులు ఎండ, వానలకు ఇబ్బందులు పడకుండా మండల కేంద్రంలో నిర్మించిన బస్‌షెల్టర్ ప్రైవేట్ వాహనాల పార్కింగ్‌కు అడ్డాగా మారింది.దీంతో ప్రయాణికులు బస్సుల కోసం రోడ్లపై నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్‌షెల్టర్‌ను వినియో గంలోకి తీసుకొచ్చి కనీస వసతులు కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



ఆత్మకూరు(ఎం) : బస్ షెల్టర్‌లో పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలు

శతాధిక వృద్ధురాలు మృతి



గాలమ్మ(ఫైల్)

భూదాన్‌పోచంపల్లి : మున్సిపాలిటీ పరిధిలోని ముక్తాపూర్ గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు కొండమడుగు గాలమ్మ(101) బుధవారం అనారోగ్యంతో మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కుమారులు కొండమడుగు మైసయ్య (మాజీ సర్పంచ్), కొండమడుగు రామేశ్వర్ (మాజీ వార్డు సభ్యుడు)తో పాటు కుమార్తె ఉన్నారు. కాగా పీఏసీఎస్ చైర్మన్ కందాడి భూపాల్‌రెడ్డి, కౌన్సిలర్, కొంగరి కృష్ణ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పాటి సుధాకర్‌రెడ్డి, మాజీ సర్పంచులు దారెడ్డి మల్లారెడ్డి, మునుకుంట్ల బాలచంద్రంగౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ రాజమల్లేశ్, కొండమడుగు రాజు, బీఆర్‌ఎస్ నాయకులు కొండమడుగు రోషన్, జక్కలి అయిలయ్య, బందారు బుచ్చిరెడ్డి, రాజిరెడ్డి, గోదాసు పాండు, దేవిగారి బాలయ్య మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఇంటర్ స్పాట్ వాల్యుయేషన్ రెమ్యూనరేషన్ చెల్లించాలి

భువనగిరి : ఇంటర్ పరీక్షల స్పాట్ వాల్యుయేషన్ రెమ్యురేషన్ వెంటనే చెల్లించాలని ప్రైవేటు లెక్చరర్స్ యూనియన్ జిల్లా నాయకుడు కర్తాల శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మూల్యాంకనం ముగిసి 50 రోజులుకావస్తున్న ఇప్పటి వరకు రెమ్యూరేషన్ చెల్లించకపోవడంతో అధ్యాపకులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ఇంటర్ బోర్డు అధికారులు వెంటనే స్పాట్ వాల్యుయేషన్ రెమ్యూరేషన్‌తో పాటు ఇంటర్ ప్రాక్టికల్, వార్షిక విధులలో పాల్గొన్న అధ్యాపకుల రెమ్యూరేషన్ చెల్లించాలన్నారు.

అదనపు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయాలి

ఆత్మకూరు(ఎం): ఓటర్లు అధిక సంఖ్య ఉన్న గ్రామాలను గుర్తించి అధికారులు అదనంగా పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కూరెల్ల రమేష్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. మండలంలోని కూరెల్లలో 303 పోలింగ్ బూత్‌లో 695 ఓట్లు ఉన్నాయని, 304 పోలింగ్ బూత్‌లో 937 ఓట్లు ఉన్నాయన్నారు. ఒక పోలింగ్ బూత్‌లో తక్కువ, ఒక పోలింగ్ బూత్‌లో ఎక్కువగా ఉండటంతో ఓటు వేయడానికి వచ్చిన వృద్ధులు, వికలాంగులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఎక్కువ మంది ఉన్న పోలింగ్ బూత్‌లలోని ఓటర్లందరినీ కలిపి మరో పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలన్నారు.

• ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



అమ్మనబోలుకు వెళ్లే రోడ్డు మూలమలుపులో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

రామన్నపేట : రామన్నపేట పట్టణకేంద్రంలో బాలికల ఉన్నత పాఠశాలకు వెళ్లే మూలమలుపు వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. మండలకేంద్రం నుంచి అమ్మనబోలుకు వెళ్లే ఆర్ అండ్ బీ రోడ్డు మూలమలుపులో ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో రోడ్డు వెంట వెళ్లే ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. ఎదురెదురుగా వాహనాలు వస్తే మూలమలుపు వద్ద ఆగి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఇక్కడి నుంచి తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

నిధులున్నా నిర్లక్ష్యమే..!

- హైలెవల్ బ్రిడ్జిలు, కల్వర్టుల నిర్మాణానికి నిధులు మంజూరు
- టెండర్లు పూర్తయినా ప్రారంభం కాని పనులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



కుర్రారం దారిలో ప్రమాదకరంగా ఉన్న కాజ్‌వే



పొట్టిమర్రి వాగుపై ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు

రాజాపేట : గతంలో కురిసిన భారీ వర్షాల కారణంగా వచ్చిన వరదలకు మండలంలోని పలు కల్వర్టులు, లో లెవల్ బ్రిడ్జిలు పూర్తిగా ధ్వంసమై ప్రమాదకరంగా మారాయి. మండల కేంద్రం నుంచి కుర్రారం వెళ్లే దారిలో దోసలవాగు కాజ్‌వే, రాజాపేట నుంచి బొందుగులకు వెళ్లే దారిలోని పారుపల్లి వాగు, రేణికుంట, బేగంపేట మధ్య వా గులోని కల్వర్టు, పొట్టిమర్రి వాగు కల్వర్టులు దెబ్బతినడంతో తాత్కాలిక మరమ్మతులు చేసి రాకపోకలు కొనసాగిస్తున్నారు. అయితే వరద తాకిడి కి కొట్టుకుపోయిన కల్వర్టులు, హైలెవల్ బ్రిడ్జిల నిర్మాణానికి గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈ పనుల కోసం టెండర్లు సైతం పూర్తయ్యాయి. కానీ నేటికి పనులు ప్రారంభం కా లేదు. వర్షాకాల సమీస్తుండడంతో కల్వర్టులు, హైలెవల్ బ్రిడ్జిల నిర్మాణాలు పూర్తయ్యే పరిస్థితులు కన్పించడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. వర్షాకాలంలో ప్రమాదకరంగా ఉన్న కల్వర్టులపై రా కపోకలు సాగించాల్సేందేనని పలువురు వాపోతున్నారు.

నిధుల మంజూరు..

మండలంలోని పారుపల్లివాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి 2022 అక్టోబర్ 7న ఆర్‌అండ్‌బీ నుంచి రూ. 12 కోట్ల 60 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఇందులో రూ. 7.5 కోట్లు బ్రిడ్జి నిర్మాణం కోసం కాగా మిగతావి దారి ఏర్పాటు కోసం ఖర్చు చేయాల్సి ఉంది. రేణికుంట, బేగంపేట గ్రామాల మధ్య వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం కోసం 25 నవంబర్ 2022న ఎస్సీ, ఎస్టీ, స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్స్ నుంచి రూ. 9 కొట్ల 50 లక్షలు మంజూరయ్యాయి. కాల్వపల్లి వాగుపై హైలేవల్ బ్రిడ్జి నిర్మాణం కోసం 18 మే 2023న రూ. 4కోట్ల 80లక్షలు, రాజాపేటలోని సుభాష్ విగ్రహం వద్ద కందకంపై కల్వర్టు ఏర్పాటు కోసం 21ఆగస్టు 2023న రూ. 60లక్షలు, ఆలేరు కొలనుపాక మధ్యలోని వాగుపై బ్రిడ్జి ఏర్పాటు కోసం 16 మే 2023న రూ. 4కోట్ల 5లక్షలు. ఆలేరు పట్టణం నుంచి జనగాం వెళ్లే దారిలోని వాగుపై హైలేవల్ బ్రిడ్జి నిర్మాణం కోసం 28 జనవరి 2022న రూ. 11 కోట్లు మంజూరయ్యాయి.కాగా ఇందులో ఒక్క రేణికుంట హైలేవల్ బ్రిడ్జి పనులు తప్పా ఎక్కడా పనులు ప్రారంభించలేదు. ఈ పనులకు సంబంధించి టెండర్లన్నీ ఒకే వ్యక్తికి రావడంతో పనుల్లో జాప్యం జరుగుతోందని పలువురు విమర్శిస్తున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



మండలంలో ప్రమాద కరంగా ఉన్న కల్వర్టులు, లో లెవల్ బ్రిడ్జిల మీదుగా వరదులు వచ్చినప్పుడు ప్రయాణించేందుకు ఇబ్బందులు పడుతున్నాం. హైలెవల్ బ్రిడ్జిల నిర్మాణానికి నిధులు మంజూరై టెండర్ల ప్రక్రియ పూర్తయినా ఇంకా పనులు ప్రారంభించ లేదు. ప్రధానంగా పారుపల్లి, కాల్వపల్లి, కుర్రారం వాగులపై బ్రిడ్జి పనులు ప్రారంభించాలని కోరుతున్నాం.

– బూక్యా శ్రీను నాయక్, రాజాపేట

టెండర్ల ప్రక్రియ పూర్తయింది



మండలంలోని పారుపల్లి, కాల్వపల్లి, ఆలేరు, కొలనుపాక వాగులపై హైలెవల్ బ్రిడ్జిల నిర్మాణ పనుల కోసం ప టెండర్ల ప్రక్రియ పూర్తైంది. కాల పరిమితిలోపు పనులు పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకుంటాం. రేణికుంట, బేగంపేట గ్రామాల వాగుపై బ్రిడ్జిల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి.

– భరత్, ఆర్‌అండ్‌బీ ఏఈ